క్లుప్తంగా

నేడు ముగ్గుల పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బస్ డిపో వెనుక రోడ్డులో ఉన్న ధన్వంతరి కార్యాలయంలో ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు అఖిల భారత బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం, ధన్వంతరి ఫౌండేషన్ బాధ్యులు పరిమి అనంతలక్ష్మి, సోమరాజు శ్రీదేవి, కొలిపాక జ్యోతి తెలిపారు. ఉదయం పది గంటలకు మొదలయ్యే పోటీలకు వచ్చే వారు వెంట సామగ్రి తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 80964 03133, 92930 55528 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

భక్త రామదాసు కళాక్షేత్రంలో సినీ సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: సంక్రాంతి సందర్భంగా నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయింత్రం 5 గంటల నుంచి సినీ సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు స్వర మాధురి కల్చరల్ యూనిట్ అధ్యక్షుడు ఆదిరాజు పురుషోత్తమరావు తెలిపారు. శనివారం ఖమ్మంలో కల్చరల్ యూనిట్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగీత విభావరి ప్రతినిధుల, నిర్వాహకులు, గాయకులు గణపతిరాజు, జనార్దన్‌రావు, కొలిశెట్టి సుధాకర్‌రావు, గాయకులు పిన్నెల్లి యాదగిరి పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జనసేన పార్టీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ రామకృష్ణ అన్నారు. శనివారం నగరంలోని పలు పాఠశాలలను సందర్శించగా అపరిశుభ్ర వాతావరణం ఉందన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

రైతులను ఆదుకోవాలి

రఘునాథపాలెం: వైరస్ తెగుళ్లతో నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకోవాలని, ఎకరాకు లక్ష రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గ్రామాల్లో సీపీఎం నాయకులు పర్యటించి వైరస్ తెగుళ్ల సోకిన మిర్చి పంటను పరిశీలించారు. వెంకటేశ్వరరావు, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ ఇమామ్, బాణోత్ నాగేశ్వరరావు, వీరయ్య, లక్ష్మీనారాయణ, లక్ష్మీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైలు నుంచి దూకి యువతి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన ఓ యువతి రైలు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరుకు చెందిన పల్లెల సంధ్యాదేవి(29) ఊబకాయంతో బాధపడుతుండగా పెళ్లి ఆలస్యమవుతోంది. దీంతో ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి విజయవాడకు వచ్చి అక్కడ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. ఈక్రమంలో ఖమ్మం అగ్రహారం గేట్ వద్దకు రాగానే తన సెల్‌ఫోన్‌ను సీటుపై పెట్టి అందరు చూస్తుండగానే రైలు నుంచి దూకి ఆత్మహత్యకు పాలపడింది. సెల్‌ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా ఆమె ఆచూకీ గుర్తించి అన్నం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో మృతదేహన్ని మార్చురీకి తరలించినట్లు రైల్వే ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు.

ఇద్దరు బాలకార్మికుల గుర్తింపు

ఖమ్మంఅర్బన్: నగరంలోని వెలుగుమట్ల గుట్టపై భవన నిర్మాణ పనుల్లో ఇద్దరు బాల కార్మికులను శనివారం గుర్తించి కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేశారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా కార్మికశాఖ, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు ఏడో తరగతి మధ్యలో మానేసి ఇద్దరు బాలురు పనికి వస్తున్నట్లు గుర్తించి కాంట్రాక్టర్‌పై కార్మికశాఖ అసిస్టెంట్ లేబర్ అధికారి శాస్త్రి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థిని కేబుల్‌వైరుతో కొట్టిన ఉపాధ్యాయుడు

తిరుమలాయపాలెం: మండలంలోని మహ్మదాపురం గిరిజన గురుకుల సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ఉపాధ్యాయుడు కేబుల్‌వైరుతో కొట్టిన ఘటన శనివారం వెలుగుచూసింది. ఈ మేరకు విద్యార్థి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని గోల్‌తండాకు చెందిన బానోతు కార్తీక్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల కిందట ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని కార్తీక్ కొట్టడంతో ఆగ్రహించిన ఉపాధ్యాయుడు సురేశ్‌బాబు అక్కడే ఉన్న కేబుల్‌వైరుతో కార్తీక్‌ను కొట్టాడు. దీంతో కార్తీక్ చర్మంపై వాతలు తేలాయి. కార్తీక్‌ను ఇంటికి తీసుకెళ్లిన తల్లి.. శనివారం తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

నగరంలో సినిమాలు

తిరుమల	ఒక్కడు
వినోద	ఖుషి
సాయిరాం	కింగ్‌డమ్ ఆఫ్ ద డయోనోసార్స్
ఆదిత్య	18 పేజెస్
శ్రీనివాస	ధమాకా
సుందర్	ఎస్ 5 నో ఎగ్జిట్

\- ఖమ్మంవ్యవసాయం

ఆదరణ అదుర్స్..!

చెరగని జ్ఞాపకంలా శిలా ఫలకాలు

- రాళ్లపై వివిధ రకాల బొమ్మలు, పేర్లు
- అధునాతన సాంకేతికతో ముందుకు
- ఏళ్లుగా వృత్తిలోనే కొనసాగుతున్న ఆర్టిస్టులు
- ఎన్నో కుటుంబాలకు ఉపాధి

SUNDAY SPECIAL



శిలాఫలకంపై అక్షరాలు చెక్కుతున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నాటి విషయాలు తెలుసుకోవాలంటే అంతా ఆషామాషి కాదు. అలాంటి విషయాలను భవిష్యత్ తరాలకు తెలియచేసేందుకు చెరగని ముద్ర వేసేలా శిలాఫలకాలు దోహదపడుతుంటాయి. ప్రస్తుత జనరేషన్‌లో ప్రతి దానిలో కొత్త రకం వస్తే పాత వస్తువులపై మోజు తగ్గుతుండడం సర్వసాధారణమైంది. అలాంటిది శిలాఫలకాలకు మాత్రం ఎన్నేళ్లైనా రాళ్లపై ఆర్ట్స్, బొమ్మలు గీసే వారికి మాత్రం ఆదరణ ఏమాత్రం తగ్గడం లేదు. రోజు రోజుకు ఆదరణ పెరుగుతూ.. అందరికి జ్ఞాపకాలను అందిస్తున్నారు ఆర్టిస్టులు.

జ్ఞాపకాలు గుర్తు చేస్తూ..

ప్రభుత్వ, ప్రైవేట్ ఇలా ఏ కార్యక్రమైనా.. ప్రారంభానికి ముందు, ప్రారంభం సమయంలో శిలాఫలకాలు వేస్తుంటారు. ఎన్నేళ్లయినా ఆ శిలాఫలకం అలానే ఉంటుండడంతో నాటి, నేటి విషయాలను భవిష్యత్ తరాలవారికి తెలియచేసేందుకు శిలాఫలకాలు దోహదపడుతుంటాయి. ఈ శిలాఫలకంలో ప్రోటోకాల్ ప్రకారం అందరి పేర్లు.. శంకుస్థాపన లేదంటే ప్రారంభం తేదీ దాని మీద రాస్తుంటారు. ఇదే క్రమంలో పలువురి ఇళ్లు, ఇతర కార్యక్రమాల్లో వారికి ఇష్టమైన దేవతలు, వ్యక్తుల ఫొటోలను శిలాఫలకాలపై చెక్కిస్తూ.. అవసరాన్ని బట్టి వాటిని వినియోగిస్తుంటారు.

ఎన్నో కుటుంబాలకు ఉపాధి..

శిలాఫలకాలు తయారు చేస్తూ ఖమ్మం నగరంలో సుమారు 200 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకొని వాటినే వృత్తిగా ఎంచుకొని జీవనం గడుపుతుండగా మరికొందరు ఇళ్ల వద్ద ఉండి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

అధునాతన దిశగా..

అందివచ్చిన అవకాశాలను ఆర్టిస్టులు సద్వినియోగం చేసుకుంటున్నారు. గతంలో గ్రానైట్ తీసుకొచ్చి దానిపై రాసి చిన్న చిన్న సుత్తితో పేర్లను చెక్కి అందంగా తీర్చిదిద్దేవారు. రాను రాను విద్యుత్ ఉపయోగంతో తయారైన వివిధ రకాల పరికరాలను రాళ్లపై ఆర్ట్స్ వేస్తున్నారు. తొలుత గ్రానైట్ రాళ్లపై వివిధ రకాల ఆర్ట్స్, బొమ్మలు, పేర్లు రాస్తుండగా.. నూతనంగా ఇల్లు నిర్మించుకున్న వారు తమకు నచ్చిన వారి పేర్లతో 'నిలయం 'రాపించుకునే వారు. కొంతమంది వివిధ రకాల బొమ్మలు గీపించేవారు. వీటికి అధికంగా గోల్డ్, సిల్వర్ రంగులు వేస్తున్నారు. తాజాగా స్టీల్ ఇచ్చింగ్ ప్లేట్స్ వస్తున్నాయి. ఇవి నేరుగా కంప్యూటర్‌లో పేర్లు నమోదు చేసి ప్రింట్ ఇస్తున్నారు.



సిద్ధంగా ఉన్న బోర్డులు



అధునాతన స్టీల్ ఇచ్చింగ్ ప్లేట్స్

ఆసక్తితో వచ్చా..



తొలుత ఆసక్తిగా ఈ వృత్తిని ఎంచుకున్నాను. 20 ఏళ్లకు పైగా ఈ వృత్తిలోనే ఉన్నాను. శిలాఫలకాలు, వివిధ రకాల బొమ్మలు గీస్తూ ఆర్టిస్టుగా స్థిర పడ్డాను. అందరికి నచ్చేలా వినియోగదారుడు కోరిన విధంగా బొమ్మలు, పేర్లు రాయటం మూలంగా ఆదరణ ఇంకా కొనసాగుతూనే ఉంది.

\- మహ్మద్ అంజద్, ఆర్టిస్ట్, ఖమ్మం

విద్యతోనే సమాజంలో మార్పు



కూసుమంచి: బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అన్నారు. శనివారం కూసుమంచిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. హెచ్ఎం విక్రంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్, డీసీసీబీ డైరక్టర్ ఇంటూరి శేఖర్, సర్పంచ్ చెన్నా మోహన్, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మైమూనా పాల్గొన్నారు.

బచ్చోడుని మండల కేంద్రంగా చేయాలి..

తిరుమలాయపాలెం: బచ్చోడుని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరుతూ గ్రామస్తులు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల సాధన కమిటీ కన్వీనర్ రామసహాయం అరవిందరెడ్డి మాట్లాడుతూ.. అన్ని గ్రామాలకు కేంద్రంగా ఉన్న బచ్చోడుని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం కూడా ఉందని వివరించారు. ఎంపీటీసీ పాప్యానాయక్, తిమ్మిడి హన్మంతరావు, ఆమంచి దయాకర్, మల్లికార్జున్, రామయ్య, గొర్రెపాటి రమేష్, దర్గయ్య, జక్కుల యాదగిరి, పల్లె మల్లయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెం సర్పంచ్ గోనె. భుజంగరెడ్డి తండ్రి సత్యనారాయణరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి శనివారం సర్పంచ్‌ను పరామర్శించారు. గూడురుపాడులో పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 10వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఎంపీపీ బెల్లం ఉమ, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, సంజీవరెడ్డి, కృష్ణారావు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లి గ్రామంలో ఇటీవల కోలాటం నేర్చుకున్న కళాకారులు శనివారం నిర్వహించిన గజ్జపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి హాజరై కోలాట ప్రదర్శనను తిలకించారు. ఎంపీపీ వజ్జా రమ్య, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం'



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: బీఆర్ఎస్‌గా పేరు మార్చుకున్న టీఆర్ఎస్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, తెలంగాణాలో మోదీ డబుల్ ఇంజన్ సర్కార్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సత్యనారాయణపురంలోని టీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గం పోలింగ్‌బూత్ కమిటీ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మతతత్వ బీజేపీని అడ్డుకుంటామని మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్వంత గ్రామం తెల్దారుపల్లి నుంచి బీజేపీ తరఫున సమ్మేళనంలో పాల్గొనడం గుర్తించాలన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి. సంజయ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నరేంద్రరావు, నున్నా రవి, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్. రాంమోహన్‌రెడ్డి, మేక సంతోష్‌రెడ్డి, బి.నాగరాజు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

నిధులు రాక అప్పుల పాలవుతున్నాం..



సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్

తిరుమలాయపాలెం: పంచాయతీల్లో చేసిన పనులకు బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని, గ్రామంలో పనుల కోసం అప్పులు తెచ్చి అప్పుల పాలయ్యామని అధికారులు బాధ్యత తీసుకుని బిల్లులు మంజూరు చెయ్యాలని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎంపీపీ మంగీలాల్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. రైతుబంధు డబ్బులు రైతు ఖాతాల్లో పడుతుంటే బ్యాంకు అధికారులు రైతు అప్పులకు ముడిపెట్టి ఖతాలను హోల్డ్‌లో పెడుతున్నారన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి రైతు బంధు డబ్బులను ఇప్పించాలని కోరారు. పాలేరు నియోజకవర్గానికి మంజూరైన నర్సింగ్ కళాశాలను మండలంలోనే నిర్మించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ జయరాం, తహసీల్దార్ పుల్లయ్య ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీటీడీ ఏఈఓకు సన్మానం

ఖమ్మంగాంధీచౌక్: తిరుమల తిరుపతి దేవస్థానం తెలంగాణ ఆల్ ధార్మిక ప్రాజెక్టుల క్లస్టర్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి(ఏఈఓ)గా బాధ్యతలు స్వీకరించిన చతుర్వేదుల సత్యనారాయణను శనివారం ఖమ్మం జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల నిర్వాహకులు హైదరాబాద్‌లో కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకులతో ఏఈఓ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రోగ్రాం కోర్డినేటర్ రామకృష్ణారెడ్డి, వివిధ జిల్లాల కో-ఆర్డినేటర్లు కృష్ణమూర్తి, వేదాంతం సీతారామచంద్రమూర్తి, రామాచారి, హరినాథ్, వేదాంత వర్దిని తదితరులు పాల్గొన్నారు.

కూరాకుల పరామర్శ

నేలకొండపల్లి: చెన్నారం సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావును శనివారం డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం పరామర్శించారు. ఇటీవల నాగేశ్వరరావు తల్లి మృతి చెందగా ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. డీసీఓ విజయకుమారితో పాటు కృష్ణమూర్తి, సత్యనారాయణ, వెంకట్రావ్ పాల్గొన్నారు.

క్రీడలతో ఐక్యత

రఘునాథపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడంతో యువతలో ఐక్యమత్యం పెరగడమే కాక నైపుణ్యం గల క్రీడాకారులు వెలుగు చూస్తారని ఖమ్మం మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ పిన్ని కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని పాపటపల్లిలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ ముత్తమ్మ, చిన్న బోయిన సైదులు, బాబు, కొండపర్తి మల్లిఖార్జునరావు, పి.చంద్రం, శ్రీను, గంగుల మంగయ్య, సత్యనారాయణ, కాముని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంలో అపార అవకాశాలు

ఖమ్మంరూరల్: ఎంబీఏ విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంలో అపార అవకాశాలున్నాయని ఐసీఐసీఐ వరంగల్, ఖమ్మం ఏరియా మేనేజర్ ఎండీ. ఇమ్రాన్ అన్నారు. శనివారం మండలంలోని పొన్నేకల్‌లో గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు జరిగిన అవగాహనా సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ.. కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్ల పరిజ్ఞానం, కష్టపడి పనిచేసే మనస్తత్వం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కోటా. అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కృష్ణమూర్తి, హెచ్ఓడీ డాక్టర్ వి.దేవేందర్, ఏ. హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యకు పరిష్కారం !

ఖమ్మం మయూరిసెంటర్: 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం 50వ డివిజన్‌లో పర్యటించిన సందర్భంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డుగా ఉన్నాయన్న స్థానికులు వెల్లడించారు. దీంతో మంత్రి సూచనల మేరకు విద్యుత్ అధికారులు శనివారం డివిజన్‌వ్యాప్తంగా పరిశీలించి ఇబ్బంది కరంగా ఉన్న స్తంభాలను తొలగించడంతో స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ టీపీ ఆధ్వర్యాన చేయూత



ఖమ్మంరూరల్: ఆర్థిక సాయం అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్/ తిరుమలాయపాలెం /నేలకొండపల్లి: ఖమ్మం రూరల్ తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలకు వైఎస్సార్ టీపీ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. ఈమేరకు ఖమ్మం రూరల్ మండలంలోని గూడురుపాడులో ఇటీవల మృతి చెందిన బండి బూషమ్మ కుటుంబాలను, గోకినపల్లి వెంకటమ్మ, తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి మాజీ సర్పంచ్ గూడురు లక్ష్మీకాంతయ్య, కొక్కిరేణిలో ఎలకొండ వరమ్మ, నేలకొండపల్లి మండలం మంగాపురం తండాలో మంగమ్మ కుటుంబాలను శనివారం వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి వ్యక్తిగత సహాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి పరామర్శించారు. అలాగే, ఆయా కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మండలాధ్యక్షుడు ఎండపల్లి వెంకయ్య, కార్యదర్శి బత్తిని యాలాద్రి, సర్పంచ్ బి.ఉపేందర్, వెంకటేష్, నాయకులు సత్యనారాయణ, కొత్తా బాలాజీరావు, ఎలకొండ నాగేశ్వరరావు, వీరభద్రం పాల్గొన్నారు.

బీజేపీ మజ్దూర్ సెల్ జిల్లా అధ్యక్షురాలిగా ఉషారాణి



నియామక పత్రం అందుకుంటున్న ఉషారాణి

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ మజ్దూర్ సెల్ జిల్లా అధ్యక్షురాలిగా మామిళ్లగూడెంకు చెందిన డాక్టర్ నీరుకొండ ఉషారాణి నియమితులయ్యారు. ఆమెకు శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ నియామక పత్రం అందజేశారు. కాగా, ఉషారాణిని నాయకులు ఉప్పల శారద, సరస్వతి అభినందించారు.

బీసీ సంఘం కార్యదర్శిగా..

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా పాండురంగాపురానికి చెందిన చింతల శ్రీను నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్‌లో జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రం అందివ్వగా, నాయకులు గుజ్జ కృష్ణ, నీలం వెంకటేష్, రాజ్ కుమార్, రాకేష్‌దత్త తదితరులు పాల్గొన్నారు.

కాల్వ పూర్తి చేయాలి

తిరుమలాయపాలెం: శ్రీరామ్‌సాగర్ రెండో దశ కాలువల నిర్మాణం పూర్తిచేయాలని ప్రజాపంథా నాయకులు శనివారం ఎంపీపీ మంగీలాల్‌కి వినతిపత్రం అందజేశారు. పార్టీ నాయకులు సి.వై పుల్లయ్య శివలింగం, పుసులూరి మంజుల, జి.రాజు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రతీ నెలా తప్పకుండా నిర్వహిస్తున్న వైద్య శిబిరం జిల్లా వ్యాప్తంగా పేదలకు, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే విధంగా అందుబాటులో వుందని, రాబోయే కాలంలో ప్రతీ నెలా ఒక ప్రత్యేకమైన డాక్టర్‌తో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మంచికంటి భవన్‌లో సీపీఎం టూ టౌన్ కమిటీ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు వైద్య పరీక్షలు చేయించుకొని అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, ప్రముఖ వైద్యులు సి.భారవి, కొల్లి అనుదీప్, రాజేష్, సుబ్బారావు, నాయకులు శ్రీనివాసరావు, సుబ్బారావు, ఝాన్సీ, శివనారాయణ, రామారావు, వాసు, వాసిరెడ్డి వీరభద్రం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మేయర్‌ను కలసిన మెప్మా సిబ్బంది



మేయర్‌ను సత్కరిస్తున్న మెప్మా సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజను మెప్మా ఉద్యోగులు, సిబ్బంది శనివారం కేఎంసీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్‌ను శాలువాలతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యకమంలో డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత, ఎడీఎఫ్‌సీ వెంకటేశ్వర్లు, సీవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవలో ముందుండాలి

నేలకొండపల్లి: విద్యార్థులు సామాజిక సేవల్లో ముందుండాలని గ్రానైట్స్ అసోసియేషన్ ప్రతినిధి, మాజీ సర్పంచ్ బైరు హరినాథ్‌బాబు సూచించారు. సింగారెడ్డిపాలెంలోని గురుకుల బాలికల పాఠశాలల్లో లక్షలాది రూపాయాల విలువ చేసే అభివృద్ధి చేసినందుకు పాఠశాల యాజమాన్యం శనివారం దాతను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ ప్రత్యూష, ప్రిన్సిపాల్ ఉజ్వలకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రమీలా, సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, పేరెంట్స్ కమిటీ ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైవే పనులతో ఇబ్బందులు

నేలకొండపల్లి: నేషనల్ హైవే పనుల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బుర్ర ఉపేంద్ర సాహు ఆరోపించారు. ఇటీవల హైవే టిప్పర్ల వలన ప్రమాదంలో గాయపడ్డ అనాసాగారం గ్రామానికి చెందిన వెంకటకిరణ్ కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. అనంతరం హైవే పనుల పై విచారణ చేపట్టాలని తహసీల్దార్ దారా ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. నాగేశ్వరరావు, పాలేరు ఇన్‌చార్జ్ ఉపేందర్, నాగరాజు, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

గుంత సంగతేంటి..?



ఖమ్మం నగరంలో ఓ పక్క డ్రెయిన్లు, రోడ్ల ఆధునీకరణ పనులు జరుగుతుంటే.. మరో పక్క గుంతలు ఏర్పడుతున్నాయి. రోడ్లను తవ్వుతుండడంతో ఏర్పడుతున్న గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని బ్యాంక్‌కాలనీలో రోడ్డును తవ్వడంతో పెద్ద గుంత ఏర్పడగా.. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. కేఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు చూసినా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

\- ఖమ్మంమయూరిసెంటర్

ప్రశ్నించాల్సిన అధికారి : రంగారావు, డీఈ, కేఎంసీ
సెల్ నంబర్ : 79012 98205

'పీఎంశ్రీ'కు బడుల పరిశీలన



పాఠశాలలో వెరిఫికేషన్ చేస్తున్న అధికారి

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాల్లో మరింత నాణ్యమైన విద్యనందిస్తూ ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా ప్రతీ మండలం నుంచి ఒక ప్రాథమిక పాఠశాల, ఒక ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి ఐదేళ్ల పాటు పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందించేందుకు ప్రణాళిక రూపొందించింది. మండలంలో తొలుత 17 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్ మార్కుల శాతం ప్రకారం ప్రస్తుతం బైరవునిపల్లి, రాజేశ్వరపురం, సింగారెడ్డిపాలెం, రాయగూడెం, బుద్దారం, సోషల్ వేల్ఫేర్ గురుకుల పాఠశాల ఈ ఆరు పాఠశాలలను ఎంపిక చేశారు. శనివారం పథకం వెరిఫికేషన్ అధికారి అబ్రహం పాఠశాలలను పరిశీలించారు. ఆన్‌లైన్ లో పొందుపరిచిన అంశాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి, బి.రాములు, సీఆర్‌పీ ప్రసాద్ పాల్గొన్నారు.